

# దయనీయా(వ్య)వస్థ

గంగుల నరసింహారెడ్డి

"అమ్మా నీకీ సంగతి తెలిసిందా" కోర్టునుండి వచ్చి ఇంట్లోకి ప్రవేశిస్తుండగానే ఎదురొచ్చి అడిగింది ప్రసూన.

"ఏంటి" అన్నాను కోటును హేంగరుకు తగిలిస్తూ.

"ఈ సందు చివరి ఇంట్లో ఉంటారు చూడు ఆ కళ్యాణి ఆంటీ ఆత్మహత్య చేసుకుంది."

అదిరిపడ్డాను. "కళ్యాణా, ఎప్పుడు, ఎందుకు?" గబగబా అడిగాను.

"ఏమో, నేను స్కూలు నుండి వస్తుండగా అక్కడ బాగా జనం గుమికూడి ఉండడంతో ఏంటా అని వెళ్లాను. కిరోసిన్ చల్లుకొని కాల్చుకుందట. అంబులెన్సు వచ్చేసరికి చనిపోయిందట."

ఎప్పుడు ఎదురయినా చిరునవ్వు నవ్వే కళ్యాణి రూపం కళ్లముందు మెదిలి హృదయం భారంగా మూలిగింది.

రోజూ పేపర్లో ఫలానా ఇల్లాలు ఆత్మహత్య చేసుకుందనే వార్త చదివి 'అయ్యో పాపం' అనుకుని ఆ తరువాత క్షణంలో మరచిపోతాం కాని మనకు తెలిసినవారే అలా చనిపోయారని విన్నప్పుడు మాత్రం ఆవేదనతో ఆలోచిస్తాం.

అందగాడైన భర్త లభించి, ముచ్చటైన ఓ పాపకూడా ఉన్న కళ్యాణి చేజేతులారా తన నూరేళ్ల జీవితాన్ని ఎందుకు పరిసమాప్తి చేసుకుందో అర్థం కావడం లేదు. భర్త ప్రకాశం కూడా బుద్ధిమంతునిలానే కనిపిస్తాడు.

మరో అరగంట తరువాత వచ్చిన మా పనిమనిషి ద్వారా మరిన్ని వివరాలు తెలిశాయి.

సుమారు మూడు గంటల ప్రాంతంలో కళ్యాణి అరుపులు వినిపించేసరికి చుట్టుప్రక్కల ఇళ్లవారు పరిగెత్తుకుని వచ్చారట. అయితే తలుపులు బద్దలు కొట్టేసరికి ఆలశ్యమైందట. అప్పటికే గుర్తుపట్టరానంత భయంకరంగా తయారయిందట ఆమె దేహం. వెంటనే ప్రకాశానికి, పోలీసులకు ఫోను చేశారట. కాని పోలీసులతోబాటు అంబులెన్సు వచ్చేసరికల్లా ప్రాణం పోయిందట.

"అంత కాలిన తరువాత ఆ యమ్మ బతకనిదే మంచిదమ్మా. చూస్తేనే నా కండ్లు దిరిగినయి" అంటుంది మా పని మనిషి.

"ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసర మేమొచ్చిందట" అడిగాను.

"ఏమో నమ్మా, పెద్దింటోళ్ళ రహస్యాలు మాకేం తెలుస్తయి, పాపం, ఆ యమ్మ బిడ్డ ఏడ్పుచూస్తుంటే నా పాణం గిలగిల కొట్టుకున్నదమ్మ."

నే నింకేం మాట్లాడలేదు.

ఆ రాత్రంతా కళ్యాణి ఆత్మహత్యకు కారణమేమయి ఉంటుందా అని ఆలోచిస్తూనే ఉన్నాను.

మర్నాడు ఉదయం కోర్టుకు వెళ్ల వలసిన అవసరం లేకపోవడంతో తీరు బడిగా కూర్చొని పేపరు తిరగేస్తున్నాను గేటు చప్పుడు కావడంతో తలతిప్పి చూశాను. మా కాలనీ సొసైటీ ప్రెసిడెంటు సత్యనారాయణగారు మరో వ్యక్తితో కలిసివస్తున్నారు.

నమస్కార, ప్రతినమస్కారాలు పూర్తయ్యాయి.

"వీరు, కళ్యాణి నాన్నగారు" అంటూ ప్రక్కనున్న వ్యక్తిని పరిచయంచేశాడు.

కళావిహీనమైన మొహం, ఏడ్చి ఎర్రబారిన కళ్లు, మనిషి చాలా దీనంగా ఉన్నాడు.

"కళ్యాణి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ప్రకాశమేనంటున్నారు సుదర్శనంగారు" ప్రారంభించాడు సత్య నారాయణగారు.

"అవునమ్మా కంటికి రెప్పలా పెంచు కున్న పిల్లను ఈ కసాయివాడికి అంటగట్టి దాని జీవితాన్ని నాశనం చేశాను."

"వివరంగా చెప్పండి, ప్రకాశం చూస్తే చాలా మంచివానిలా కనిపిస్తాడే!"

"నేనూ అలాగే మోసపోయానమ్మా, వాడొట్టి దగుల్బాజీగాడని తరువాత తెలిసొచ్చింది. నా బిడ్డను నరకయాతన పెట్టిన వాన్ని ఊరికే వదలదలుచుకోలేదు నేను. వాడు జైల్లో అంతకన్నా ఎక్కువ శిక్షింపబడితేగాని నా మనసుకు శాంతి లేదు." కసి, కోపంతో మొహమంతా జేవురించగా వణుకుతున్న గొంతుతో అన్నాడు. "ఎంత డబ్బు ఖర్చయినా పరవాలేదు. తోటి ఆడదానికి జరిగిన అన్యాయానికి మీరు న్యాయం చేకూర్చాలి."

"దీని కొరకు మీ రింతగా అడగాల్సిన అవసరం లేదండీ, ఎందుకంటే కళ్యాణి నాకూ పరిచయమే. నేనెంతో బాధపడు తున్నాను ఆమె ఆత్మహత్య చేసుకోవ డానికి అతనే కారకుడయితే తప్పక శిక్షింపబడి తీరాల్సిందే, చెప్పండి. ప్రకాశ మెలాంటి వాడు?"

గద్గద స్వరంతో చెబుతున్నారాయన.

నేనూ, సత్యనారాయణగారు ఆశ్చర్యంగా వింటున్నాం.

నిజానికి కళ్యాణి ప్రకాశానికి సరయిన జంట కాదు. ప్రకాశం హుందాగా,

ఆకర్షణీయంగా ఉంటాడు. అతనితో పోలిస్తే కళ్యాణి అందమైనది కాదు. అతను ఎరుపురంగులో భారీగా ఉంటే కళ్యాణి చామనఛాయతో పొట్టిగా ఉంటుంది. అయితే అతను కేవలం కట్నం డబ్బుకు ఆశపడి ఆమెను పెళ్లి చేసుకున్నాడు.

సమాజంలో అందరి మధ్యా భార్యతో తిరగవలసి వచ్చినప్పుడు ఆమె అనాకారి తనం తెలిసొచ్చిందతనికి. అలా ఆమెపై అయిష్టం పెంచుకొని దానిని తిట్ల ద్వారాను, దెబ్బల ద్వారాను తీర్చుకొని సంతృప్తి చెందేవాడు.



అతను చూడడానికి ఎంతో బుద్ధిమంతు నిలా ఉన్నా ఉండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. తాగుడు, పేకాట అతని నిత్య కృత్యాలు. కాలేజీ అమ్మాయిలను ఆకర్షించుకొని వాళ్లను తనతో తిప్పు కుంటూ డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టడం అతని సరదా. అందుకే జీతం డబ్బు నెల మొదటివారంలోనే ఖర్చు కాగా అప్పులు చేసేవాడు. అప్పులవాళ్లు బలవంతం చేసినప్పుడు కళ్యాణితో బల వంతంగా ఉత్తరం రాయించి మామగారి దగ్గర్నుండి తెప్పించుకునేవాడు.

ఎన్నోసార్లు డబ్బు పంపి ఇంకా పంపగలిగే స్తోమత లేక సుదర్శనం అలసిపోయాడు. అందుకే కూతురు ఉత్తరం రాసినా డబ్బు పంపడం మానే శాడు. ఫలితంగా కళ్యాణి ఎన్నో దెబ్బ లకు, చిత్రహింసలకు గురికావలసి వచ్చింది.

అయితే ప్రకాశం చాలా తెలివయిన వాడు. కనీసం పనిమనిషి ముందు కూడా భార్యను కొంచెమైనా కసురుకునేవాడు కాదు. పైగా ఎంతో ప్రేమ కురిపించే వాడు. ఎవరూ లేనప్పుడే అతనిలోని రాక్షసుడు నిద్రలేచేది.

"ఇవిగో చూడండి రాధాదేవిగారు మా కళ్యాణి కన్నీటితో రాసిన ఉత్త రాలు" అంటూ అయిదు ఉత్తరాలు అందించాడు సుదర్శనం.

ఒక్కొక్క ఉత్తరం ఒక శోక సముద్రంలా ఉంది. ప్రతి అక్షరం కళ్యాణి కన్నీటి బిందువులా గుండెను కదిలించివేసింది. దుర్మార్గుడైన భర్త లభిస్తే ఆడదాని జీవితం ఇంత దుర్భరమా అనిపించింది. ఈ జీవితాలన్నింటికి పరిష్కారం ఆత్మహత్యేనా!!

ఇది ఒక్క కళ్యాణి కన్నీటి చరిత్రే కాదు. ఎందరో అభాగినుల దయనీయ గాధ. నూతిలో దూకి కొందరు, అగ్నిలో ఆహుతియైపోయి కొందరు- ఇలా ఎందరో!! కట్నం తక్కువ తెచ్చిందని అనాకారిగా ఉందని ఏవేవో కుంటి సాకులతో ఆడదాన్ని హింసించి చివరికి నోట్లో గుడ్డలు కుక్కి కిరోసిన్ చల్లి కాల్చిన భర్తలు, అత్తామామల్ని రోజూ పేపర్లో చూస్తూనే ఉన్నాం. ఇందులో ఎందరికి శిక్ష పడుతుంది? చాలామటుకు అందరు నిర్దోషులుగా నిరూపించబడి పెద్దమనుషుల్లా తిరుగుతున్నవారే!

"ప్రకాశాన్ని దోషిగా నిలబెట్టడానికి కేవలం ఈ ఉత్తరాలే కాకుండా కళ్యాణి మరణవాఙ్మూలం ఉండిఉంటే చాలా బావుండేది. పోలీసులు రాకముందే చని పోయింది కాబట్టి కొంతవరకు ప్రకాశం అదృష్టవంతుడే. అయినా మనం నిరాశ పడాల్సిన పని లేదండి కేసు తప్పని సరిగా ఫైల్ చేద్దాం." అన్నాను దృఢ కంఠంతో. "ఆత్మహత్య చేసుకోబోయే ముందు కళ్యాణి రాసిపెట్టిన ఉత్తర మేదైనా దొరికితే ఇంకా బలం ఉండేది."

"అట్లాంటి దేమైనా దొరుకుతుందేమో నని నేను ఇల్లంతా గాలించానండి. పోలీసులను మంచిచేసుకొని ప్రకాశం ఆ ఉత్తరాన్ని సంపాదించాడు కాబోలు ఎక్కడా లేదు."

"సరే మన ప్రయత్నం మనం చేద్దాం" అని సత్యనారాయణగారివైపు తిరిగి "ఈ లోగా మనం కాంలనీవాళ్లంతా కలిసి ఓ పని చేయాలండి" అన్నాను.

"చెప్పండి."

"మనం అతన్ని వెలివేయాలి. కాలనీలో అతన్ని మనం ఓ అస్పృశ్యు నిలా పరిగణించాలి. నేను మన మహిళా మండలి సెక్రటరితో కూడా మాట్లాడ తాను, ఏం చేయాలో సాయంత్రం చర్చిద్దాం...."

* * *

నా ఉద్దేశ్యం చెప్పేనరికి మహిళా మండలి సభ్యురాళ్లనుండి కూడా మంచి ప్రతిస్పందన వచ్చింది. "అవును అలా చేయాల్సిందే" అన్నారు ముక్తకంఠంతో ఆవేశంగానూ, ఉత్సాహంగాను.

మొదటి చర్యగా కరపత్రాలు ప్రింట్ చేయించాం.

'కట్న పిశాచానికి బలయిన కళ్యాణి' అనే టైటిల్‌తో ప్రకాశం క్రూర మనస్తత్వాన్ని విశదీకరిస్తూ కళ్యాణి తన జీవితానికి రాసుకున్న విషాదపు ముగింపును వివరించామందులో.

ఆ మరునాడు మహిళామండలినుండి ప్రకాశం ఇంటిదాకా ఊరేగింపు జరిపాం.

'కళ్యాణికి న్యాయం జరగాలి.'

'ప్రకాశాన్ని శిక్షించాలి.'

'ప్రకాశం డౌన్ డౌన్'

'కళ్యాణి అమర్ హై.'

మా కాలనీ స్త్రీలందరిలో కనిపిస్తున్న ఆవేశం నా కెంతో సంతృప్తి కలిగించింది. మా ఈ ఊరేగింపు తన ఇంటి వైపు రావడంతో ప్రకాశం అదిరిపోయాడు. అప్పుడే అతను ఆఫీసుకు బయల్దేరబోతున్నట్లున్నాడు. మమ్మల్ని చూడగానే వణికిపోయాడు. మాలో కొందరు తీవ్రవాదులు అతనిపై రాళ్ళు కూడా రువ్వారు. అతను భయంతో ఇంటోకి పరుగెత్తుకొని వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

అతసలా భయపడిపోయి ఇంట్లో దాక్కునేసరికి మాలో ఉత్సాహం రెట్టింపయి అసలు అతన్ని ఇంట్లోంచి బయటకు కాలుపెట్టకుండా గృహబందీ అయ్యేట్లు వంతులవారీగా ఆ ఇంటిముందు నినాదాలిచ్చేందుకు నిర్ణయానికి వచ్చాం.

మాకు తోడు చుట్టుప్రక్కల కాలనీల వాళ్ళు కూడా కలిసిరావడంతో అందరి నోళ్ళలో నాని పేపర్లోకి కూడా ఎక్కింది కళ్యాణిగాథ.

ఇద్దరుముగ్గురు విలేఖరులు మాతో ఇంటర్వ్యూ కూడా జరిపారు. మేమంతా ముక్తకంఠంతో చెప్పిందొక్కటే 'ప్రకాశానికి శిక్షపడేదాకా మేం విశ్రమించం.'

'పురుషుల ఘోరకృత్యాలపై స్త్రీ శక్తి ధ్వజం' అని మరోపత్రిక రాసింది.

పత్రికల్లో చదివి అసెంబ్లీలో స్త్రీ సభ్యురాళ్ళు కళ్యాణి ఆత్మహత్య కేసును ప్రస్తావించారు. మరుసటిరోజు స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రిగారు మా కాలనీకి పరిగెత్తుకొచ్చారు.

కళ్యాణి ఆత్మ శాంతించేట్లుగా ప్రకాశానికి తగినశిక్ష విధింపబడేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చిన తరువాతే మేం ప్రకాశం ఇంటిదగ్గర్నుండి కదిలాం.

నిజంగా ఇది గొప్ప విజయమనిపించిందా క్షణాన.

విజయోత్సాహంతో నినాదాలు చేసుకుంటూ ఎవరి ఇళ్ళకు వాళ్ళం వెళ్ళిపోయాం.

ఎవరూ తనని చూడని ఓ అర్ధరాత్రి సమయాన ప్రకాశం ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడని మరునాటి ఉదయం తెల్సింది.

అందుకు కారణం మేమే కాబట్టి ఎంతో గర్వపడ్డాం.

* * *

ఈ లోకం తీరే అంత. ప్రజల ఆవేశం పాలపొంగులాంటిది. ఎక్కువ కాలంఉండదు. ఎంత తొందరగా పొంగుతుందో అంతతొందరగా చల్లారిపోతుంది.

రోజులు గడుస్తున్నాయి.

కళ్యాణికేసు మూడుసార్లు వాయిదా పడింది.

ప్రకాశం కనపడకుండా పోయేసరికి

కాలనీ స్త్రీలు కూడ కళ్యాణిని మరచి పోయారు.

ప్రకాశానికి శిక్షపడేలా చూస్తానని హామీఇచ్చిన స్త్రీ, శిశు శాఖామాత్యులవారు తన హామీని గాలికొదిలేశారు.

మహిళామండలిలో నేను రెండు మూడు మార్లు కళ్యాణి కేసువిషయం ప్రస్తావించినా ఎవరూ పెద్ద ఉత్సాహం కనబరచలేదు.

అప్పుడనిపించింది నాకు. ఆవేశం అనేది ఎప్పుడూ పొంగకూడదు. మరగాలి, లోలోపలే కుతకుత ఉడకాలి. అప్పుడు కాని ఒక ఉద్యమలక్ష్యం నెరవేరదు.

ఆ రోజు నేను నిద్రలేవగానే పని మనిషి చెప్పింది ఎవరో క్లయింటు వచ్చారని.

తల దువ్వుకొని, మొహం కడుక్కొని డ్రాయింగ్‌రూంలోకి వెళ్ళే సరికి కళ్యాణి నాన్న సుదర్శనం లేచి నమస్కారం చేశాడు.

"కూర్చోండి" అన్నాను ప్రతి నమస్కారం చేస్తూ.

మనిషి అదోలా ఉన్నాడు. ఎందుకో సిగ్గుపడుతున్నవానిలా కూడా కనిపించాడు.

"చెప్పండి" అన్నాను. "కళ్యాణి పాప ఎలా ఉంది?" కూతురు చనిపోయాక మనవరాలిని తనవెంటే తీసుకుపోయాడు.

బాగానే ఉందన్నట్లుగా తల ఊపాడు. అయన ఏదో చెప్పడానికి సంశయిస్తున్నట్లుగా తోచింది నాకు. "కేసును వచ్చే నెల పదహారుకు వాయిదా వేశారు. ఉత్తరం రాశాను మీకు అందిందా" అన్నాను

అందిందన్నట్లుగా తల ఊపి, కొద్దిసేపాగి "మీ రేమనుకోనంటే ఓ మాట చెబుదామని వచ్చానండి లాయరుగారూ" అన్నాడు. తల ఎత్తినా కళ్లు దించుకునే ఉన్నాడు.

"చెప్పండి" అన్నాను ఉత్సుకతగా.

"ప్రకాశంపై పెట్టిన కేసును విరమించుకోవాలని అనుకుంటున్నానండి."

"ఎందుకు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

మళ్లీ మౌనం

"తీర్పు మనకు అనుకూలంగా వచ్చే అవకాశమున్నప్పుడు కేసునెందుకు విత్‌డ్రా చేసుకుంటారు?" తిరిగి నేనే అడిగాను.

"మా అఖిరమ్మాయిని ప్రకాశానికిచ్చి పెళ్లి చేద్దామనుకుంటున్నామండి."ఇప్పుడు కళ్లే గాదు తల కూడా దించుకున్నాడు.

అదిరిపడ్డాను.

మొదట అర్థంగానట్లుగా తరువాత అయోమయంగా చూశానతనివంక.

'....దగుల్బాజీగాడు... వాడు జైల్లో అంతకన్నా ఎక్కువగా శిక్షింపబడితేనే గాని నా మనసుకు శాంతిలేదు....' అన్న సుదర్శనమేనా ఈనాడిలా మాట్లాడుతుంది.

"క్షమించండి. చేస్తున్న పనికి నే నెంతో సిగ్గుపడుతున్నాను కాని నా పరిస్థితి అలాంటిది. ఆఖరమ్మాయికి పెద్ద కట్నమిచ్చి పెళ్లి చేసేంత స్తోమత లేకుండాపోయింది నాకు. కళ్యాణి బిడ్డను ఇప్పుడైతే పెంచగలను కాని పెద్దయ్యాక దాన్నో ఇంటిదాన్ని చేసే శక్తి ఉంటుందా. అదీగాక ప్రవాసానికి పిల్ల నిస్తామంటూ ఎంతోమంది తిరిగి పోతున్నారట. అంతెందుకు మీ కాలనీ సొసైటీ ప్రెసిడెంటు సత్యనారాయణ గారే తన బంధువుల అమ్మాయి నివ్వ డానికి ప్రయత్నిస్తున్నారట...."

"సత్యనారాయణగారా....!" ఆశ్చ ర్యంతో తలమునకలయిపోతున్నాను.

"అవునండీ ఆయనే, ఎవరో కొత్త అమ్మాయిని చేసుకుంటే కళ్యాణి బిడ్డను నేను పంపినా సక్రమంగా చూస్తుందనే నమ్మకం లేదుగా. అందుకే ఈ నిర్ణ యానికి వచ్చానండి. మీకు ఇబ్బంది కలిగించినందుకు క్షమించండి...."

నేనేం మాట్లాడలేదు. కళ్యాణి కేసు ఫైల్లో ఉన్న ఆమె ఉత్తరాల్ని తీసి అయన ఎదురుగా టేబిల్ పై పడేశాను.

"కేసు విత్ డ్రా చేసుకుంటున్నట్లు ఇక్కడ సంతకం పెట్టి వెళ్లండి."

పెట్టి, నమస్కరించాడు.

ప్రతినమస్కారం చేశాను.

నా మౌనం ఆయన్ను బాధించి నట్లుంది. కొంత దూరం నడిచినవాడు ఆగి వెనుదిరిగాడు.

"నే నెలా ప్రవర్తించినందుకు మీ కెంతో అసహ్యం కలుగుతుందని తెలుసు. కాని రాధాదేవిగారూ, నన్ను కాదు అసహ్యించుకోవాల్సింది, నా పరి స్థితులను, నే నున్న వ్యవస్థను అస హ్యించుకోండి" మళ్లీ వెనుదిరగకుండా భారంగా వెళ్తున్నాడు సుదర్శనం.

'....నా పరిస్థితులను, నే నున్న వ్యవస్థను...' అన్న ఆయన మాటలు చెవులో గింగురుమంటుండగా, పెళ్లి కొడుకు వేషంలో ప్రకాశం వికృత రూపం కళ్లముందు భయంకరంగా గోచరిస్తుండగా భావావేశాలకు అతీత మైన నిర్లిప్తతలోంచి ఈ దేశపు మధ్య తరగతి కుటుంబాల సగటు ఆడపిల్లల తండ్రి నిష్క్రమణను చూస్తున్నాను నేను!

